క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్ఠాపనలో జెడ్పీ చైర్మన్



విగ్రహ ప్రతిష్ఠాపనలో జెడ్పీ చైర్మన్, పార్టీ నాయకులు

బైరెడ్డిపల్లె: మండలంలోని దాసార్లపల్లెలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ముత్యాలమ్మ, తిరుపతి గంగమ్మ విగ్రహాలను భక్తిప్రపత్తులతో ప్రతిష్ఠించారు. ఉదయం ప్రాతఃపూజ, ప్రతిష్ఠాహోమం, విగ్రహ, ప్రాణ ప్రతిష్ఠ..తదితర కార్యక్రమాలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శి బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, సర్పంచులు చంద్రమౌళి, రమణారెడ్డి, రవిచంద్రబాబు, వైస్ ఎంపీపీలు నారాయణస్వామి, రూపజయకుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

కోలాహలంగా నిమజ్జనం



ఈస్ట్‌పేటలో దుర్గాదేవి ఊరేగిస్తున్న దృశ్యం

పుంగనూరు: పట్టణంలోని ఈస్ట్‌పేటలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాన్ని ఆదివారం పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. దసరా సందర్భంగా దుర్గామాతను ఏర్పాటు చేసి 13 రోజుల పాటు వివిధ రూపాలలో అమ్మవారు పూజలు అందుకున్నారు. చివరి రోజు యువకులు శోభాయాత్ర నిర్వహించి కోలాహలంగా నిమజ్జనం చేశారు.

7న చలో విజయవాడ

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్ల సమస్యల పరిష్కారానికి ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం ఆ సంఘం జిల్లా కార్యాలయంలో చలో విజయవాడ కార్యక్రమం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు కావొస్తున్నా ఇంతవరకు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం దారుణమన్నారు. ఎన్నికల సమయంలో అనేక హామీలు గుప్పించి ప్రస్తుతం అమలు చేయకపోవడం అన్యాయమని విమర్శించారు. ఉద్యోగ సంఘాలను ఇంత వరకు కనీసం చర్చలకు పిలవకపోవడం అన్యాయమన్నారు. 12వ పీఆర్సీ కమిటీకి వెంటనే చైర్‌పర్సన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. మధ్యంతర భృతి (ఐఆర్) 30 శాతానికి తగ్గకుండా ప్రకటించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. 2003 డీఎస్సీలో ఎంపికై 2004 సెప్టెంబర్ ఒకటి తర్వాత విధుల్లో చేరిన టీచర్లకు కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన మెమో నంబర్ 57ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 7న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమానికి ఎస్టీయూ నాయకులు, టీచర్లు అధిక సంఖ్యలో విచ్చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటామోహన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు రూ.30 వేల కోట్ల పెండింగ్ నిధులను దశలవారీగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 11వ పీఆర్‌సీ బకాయిలు, పీఎఫ్, ఏపీజీఎల్ఐ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఉమ్మడి సర్వీస్ నిబంధనలను రూపొందించి అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్ టీచర్లకు జేఎల్స్‌గా, ఎంఈఓలుగా ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు.



పెద్దపురం–పెద్దచల్లారగుంట రహదారిలో నీటిలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు

బైరెడ్డిపల్లె: మండలంలోని పెద్దపురం నుంచి పెద్దచల్లారగుంటకు వెళ్లే రహదారిలో ప్రయాణం నరకంగా మారింది. గతంలో వర్షమొస్తే చెక్‌డ్యామ్‌ల నుంచి చెరువుకు నీరు చేరేది. అయితే ఇటీవల కొంత మంది చెక్‌డ్యామ్‌లను ధ్వంసం చేయడంతో వర్షపు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. రహదారిపై పూర్తిగా వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. యువకులు ఈ ఇబ్బందులను సెల్ కెమెరాలలో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.



రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

సదుం: మండల కేంద్రంలోని పీలేరు మార్గంలో కుమారొడ్డుని చెరువు సమీపంలో వర్షపు నీరు రోడ్డుపై చేరుతోంది. చిన్న పాటి వర్షం కురిసినా పరిస్థితి ఇలా తలెత్తుతుండడంతో పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. వాహనాలు వెళ్తున్న సమయంలో నీరు పాదచారులపై పడుతోంది. చెరువుకు వెళ్లే కాలువలను పలువురు ఆక్రమించుకోవడం మూలాన నీరు రోడ్డుపై చేరుతోందని, ఆక్రమణలు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

పగలే వెన్నెల!





రొంపిచెర్ల: రొంపిచెర్ల గ్రామ పంచాయతీలో రేయింబవళ్లూ వీధి దీపాలు వెలుగుతున్నాయి. ప్రభుత్వం విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని ఆదేశిస్తున్నా అధికారులు మాత్రం కరెంటు దుబారా చేస్తున్నారు. స్థానిక గ్రామ సచివాలయం ఎదుట ఒకటి, వెనుక ఒకటి వీధిలైట్లు పట్టపగలే వెలుగుతున్నాయి. మరోవైపు తమకు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కృష్ణమూర్తి కాలనీ వాసులు ఆరు నెలల నుంచి కోరుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇకనైనా సంబంధిత లఅధికారులు అవసరమైన చోట వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, పగలు వెలగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మానవత సంస్థ నూతన కార్యవర్గ సభ్యులు


నూతన కార్యవర్గం ఎన్నిక

పుంగనూరు: అనాథలు మృతదేహాలకు అంతిమ సంస్కారాలు చేయడానికి చేయూతనిస్తున్న మానవత స్వచ్ఛంద సంస్థ నూతన కార్యవర్గం ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా నారాయణ రెడ్డి, సెక్రటరీగా డాక్టర్ పూల ప్రభాకర్, కోశాధికారిగా నరసింహారెడ్డి, ఉపాధ్యక్షురాలుగా విశ్రాంత ఎంఈఓ సరస్వతి, సంస్థ చైర్మన్‌గా నందీశ్వరయ్య, కో–చైర్మన్‌గా నానబాల గణేష్, కన్వీనర్‌గా పూల త్యాగరాజు, సహాయ కార్యదర్శిగా హరినాథ రెడ్డితో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. సమావేశంలో డాక్టర్ శరణ్‌కుమార్, సీనియర్ న్యాయవాది మల్లికార్జునరెడ్డి, పట్టణ ప్రముఖులు భక్తవత్సలరాజు, డిగ్రీకళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో విగ్రహ ప్రతిష్ఠాపన

పెద్దపంజాణి: మండలంలోని తిప్పిరెడ్డిపల్లెలో నూతన శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఉదయం అర్చకులు గణపతి పూజ, గోపూజ, వివిధ హోమాలు, విశేష పూజల అనంతరం ఆంజనేయ సహిత సీతా రామ లక్ష్మణ విగ్రహాలను సుందరంగా అలంకరించారు. తదుపరి వేదపండితులు సీతారాముల కల్యాణోత్సవం భక్త జన సందడి నడుమ మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదానం చేశారు. సాయంత్రం సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను మంగళ వాయిద్యాలు, భజనల నడుమ తిప్పిరెడ్డిపల్లె, కొత్తబూరగపల్లె, ఎర్రమ్మ చెరువు ఎస్టీ కాలనీలో ఊరేగించారు.





వీరాంజనేయస్వామి విగ్రహం, సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులు



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

అసలు నిందితులను అరెస్టు చేయాలి



మాట్లాడుతున్న వైఎస్ఆర్ సీపీ నాయకులు

పాలసముద్రం: అంబేడ్కర్ విగ్రహం పెట్టిన దళిత సర్పంచ్ గోవిందయ్యను పోలీసులు విచారణ పేరుతో వేధించడాన్ని జెడ్పీటీసీ సభ్యుడు అస్ఫలనగ్, ఎంపీటీసీ గోవిందరాజు ఖండించారు. ఆదివారం పాలసముద్రంలో వారు మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహాన్ని కాల్చేసిన వారిని కాపాడ్డానికి అమాయక దళితుడిని నిర్బంధించడంపై వారు మండిపడ్డారు. కూటమి పాలనలో దళితులను చిన్నచూపు చూడడం, అవహేళన చేయడం రివాజుగా మారుతోందన్నారు. ఇప్పటికైనా పోలీసులు అసలు నిందితులను అరెస్టు చేయాలన్నారు. మండల మాజీ కన్వీనర్ సుందరరాజు, పద్మనాథ నాయుడు, రవిరెడ్డి, షణ్ముగరెడ్డి, ప్రకాష్, ప్రేమ్ కుమార్, వేణు, గోపాల్, విష్ణు, ధనపాల్, చలయ్య తదితరులు పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

రీ-సర్వేపై గ్రామసభలు

చౌడేపల్లె: కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని ఏ.కొత్తకోట, పందిళ్లపల్లె, 29–ఏ చింతమాకులపల్లె గ్రామ పంచాయతీల్లో సోమవారం రీసర్వే నిర్వహణపై గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పార్వతి తెలిపారు. తొలుత ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, పంట కాలువలు మొదలైన వాటిని రీసర్వే చేస్తామని, సర్వే సమయంలో ప్రజలు అధికారులకు సరైన సమాచారమిచ్చి సహకరించాలని కోరారు.

టెట్ పరీక్ష సమస్యపై ఢిల్లీస్థాయిలో ప్రయత్నాలు



మాట్లాడుతున్న డా.స్వామికణ్ణన్

చిత్తూరు కలెక్టరేట్ : టెట్ పరీక్ష సమస్య పరిష్కారానికి పీఆర్‌టీయూ సంఘం ఢిల్లీ స్థాయిలో ప్రయత్నాలు సాగిస్తున్నట్లు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డా.స్వామికణ్ణన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయులుగా నియమించబడిన వారు ప్రస్తుతం సర్వీస్‌లో కొనసాగాలన్నా, ఉద్యోగోన్నతి పొందాలన్నా టెట్ తప్పనిసరి అని చెప్పడం ఆందోళనకు తావిస్తోందన్నారు. జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి నోటిఫికేషన్ 2010 ఆగస్టు 23వ తేదీ ప్రకారం 2010కి ముందు వివిధ డీఎస్సీ నోటిఫికేషన్లలో నియమింపడిబడిన వారికి టెట్ ఉత్తీర్ణతతో సంబంధం లేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రెండేళ్లలో టెట్ ఉత్తీర్ణత సాధించడం సాధ్యం కాదని చెప్పారు. ఇది అమలైతే ఉద్యోగోన్నతులు లేక ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల కొరత ఏర్పడుతుందన్నారు. దీన్ని అధిగమించేందుకు విద్యాహక్కు చట్టం సెక్షన్ 23(2) ప్రకారం టెట్‌కు తాత్కాలిక మినహాయింపు ఇవ్వవచ్చని తెలిపారు. ఎన్‌సీటీఈ నోటిఫికేషన్ కంటే ముందు జారీ చేసిన డీఎస్సీలలో నియమింపబడిన వారికి సర్వీస్‌లో కొనసాగడానికి, ఉద్యోగోన్నతి పొందడానికి టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టం సెక్షన్ 23(2)కి సవరణ, టెట్ సమస్యను పరిష్కరించాలంటూ కేంద్రస్థాయిలో పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు ప్రయత్నాలు సాగిస్తున్నారన్నారు. ఇటీవల కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహననాయుడును కలిసి టెట్ సమస్య పరిష్కారంపై వినతిపత్రం ఇచ్చారని వెల్లడించారు.

పాఠశాలల్లో రాస్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్రీయ అవిష్కార్ సప్తాహ్ (రాస్) కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో రాస్ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా చెట్ల పెంపకం, నీటి సంరక్షణ అంశాలపై షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

టీచర్లకు రోటరీ క్లబ్ సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధులు

పుంగనూరు: ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం రోటరీక్లబ్ నిర్వాహకులు సన్మానించించారు. ఉపాధ్యాయులు అయూబ్‌బాషా, రాజమ్మ, అనిల్‌కుమార్, వనిత, కమలమ్మ, ద్వారకమ్మ, వేణుగోపాల్‌రాజు, జగన్‌మోహన్‌రెడ్డి, సుధాకర్‌రావుకు శాలువలు కప్పి సన్మానించి, జ్ఞాపికలు అందజేసింది. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు నానబాల గణేష్, సీఎస్.రాజారెడ్డి, డాక్టర్లు ప్రభాకర్, శరణ్‌కుమార్, సుధాకర్‌రెడ్డి, భాస్కర్, అవుల హరిప్రసాద్, అనిల్‌కుమార్, సురేష్, సత్యాచారి, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలానికి 25 మంది ఉత్తమ టీచర్లను సన్మానించారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉత్కృష్టమైనదని, ఉత్తమ సమాజాన్ని తీర్చిదిద్దడంలో టీచర్ల పాత్ర అమోఘమని ఎంఈఓ నటరాజ్ అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు నిరంజన్, అఫ్జల్, గురుకుల ప్రిన్సిపల్ శ్రీనివాస్ రెడ్డి, టీచర్లు మోహన్‌రెడ్డి, సుధాకర్, కిశోర్, కృష్ణమూర్తి, వినోద్ పాల్గొన్నారు.



సదుం: ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సిబ్బంది

తిరుపతికి వెళ్లిన కురబ కులస్తులు



తిరుపతికి వెళ్తున్న కురబ కులస్తుల బృందం

పుంగనూరు: తిరుపతిలో ఆదివారం భక్త కనకదాసు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు పుంగనూరు నియోజకవర్గం నుంచి కురబ కులస్తులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. పోస్టర్లను పట్టుకుని భక్త కనకదాసు సేవలను వివరిస్తూ జై కురబ...జైజై కురబ నినాదాలు చేస్తూ స్థానిక అబ్దుల్ కలామ్ సర్కిల్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కుల సంఘ ప్రతినిధులు చెంగ్రాలాయప్ప, గోపాల్, హేమంత్‌కుమార్, యశ్వంత్‌కుమార్, జయకుమార్, హరీష్, మధు, గవ్వప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రొంపిచెర్ల నుంచి..

రొంపిచెర్ల: తిరుపతిలో జరిగిన భక్త కనకదాసు విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆదివారం మండలం నుంచి కురబ కులస్తులు కలిసి వెళ్లారు. తొలుత రొంపిచెర్ల సమీపంలోని వీఎంఆర్ కళ్యాణ మండపంలో కురబలు సమావేశమయ్యారు. తిరుపతిలో మంత్రి సవితకు సమస్యలపై వినతి పత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ ఊయల రమణ, ఓబులేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అర్జున తపస్మాన్



తపస్సు మానును అధిరోహిస్తున్న అర్జునుడిని తిలకించడానికి విచ్చేసిన భక్తజనం

తవణంపల్లె: మండల కేంద్రమైన తవణంపల్లెలో ఆదివారం సాయంత్రం వైభవంగా అర్జున తపస్సు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ద్రౌపదీ సమేత ధర్మరాజుల గుడిలో 120వ సంవత్సర మహాభారత యజ్ఞం కార్యక్రమంలో భాగంగా సంత గేటులో అర్జున తపస్సును భక్తితో నిర్వహించారు. ద్రౌపదీదేవి, భీముడు, అర్జునుడు, నకుల సహదేవుల విగ్రహాలకు, తపస్సు మానుకు భక్తులు విశేషంగా పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం కళాకారుడు మణికంఠ అర్జునుడి వేషధారణలో తపస్సు మానును అధిరోహించారు. పైనుంచి విసిరిన విబూధి, నిమ్మపండ్లు, బొరుగులు, బిల్వ ఆకులు, అరటి పండ్ల కోసం భక్తులు ఎగబడ్డారు. సంతానం కోసం మహిళలు తడిదుస్తులతో ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

పీహెచ్‌సీ శుభ్రతకు నిధుల్లేవట..!

పరిసరాల శుభ్రతతోనే ప్రజారోగ్యం ముడిపడి ఉంటుందని వైద్యులు, అధికారులు, పాలకులు చెప్పే మాటలు. కానీ క్షేత్రస్థాయిలో పీహెచ్‌సీల్లోనే అపరిశుభ్ర వాతావరణం నెలకొన్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. అందుకు యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రమే సాక్ష్యంగా నిలుస్తోంది. ఆస్పత్రి ఆవరణలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి అడవిని తలపిస్తున్నాయి. దీంతో దోమలు రాత్రిపగలూ తేడా లేకుండా స్వైర విహారం చేస్తున్నాయి. పరిసరాల శుభ్రం కోసం జిల్లా వైద్యాధికారిని సంప్రదిస్తే నిధులు లేవని చెబుతున్నారని స్థానిక సిబ్బంది చెబుతున్నారు.

- యాదమరి పీహెచ్‌సీలో కొరవడిన పారిశుద్ధ్యం
- పిచ్చిమొక్కలతో విషసర్పాలకు ఆవాసం
- సమస్య చెబితే నిధులు లేవని జిల్లా వైద్యాధికారి దాటవేత
- జేసీబీతో శుభ్రం చేయిస్తానని బీరాలు పలికిన ఓ కూటమి నేత
- ఆపై స్పందన శూన్యం
- ఆందోళన చెందుతున్న వైద్యులు, రోగులు



యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



ఆస్పత్రి ఆవరణలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

యాదమరి : అసలే వర్షాకాలం.. సీజనల్ వ్యాధులు బారిన పడి రోగులు పీహెచ్‌సీలకు క్యూ కడుతున్నారు. అయితే యాదమరి పీహెచ్‌సీకి రోగంతో వెళ్లిన వారికి మరో కొత్త రోగం రాక మానదు. ఎందుకంటే పీహెచ్‌సీ ఆవరణలో పిచ్చిమొక్కలు ఏపుగా.. వర్షం వస్తే నీరు నిల్వ ఉంటుండడంతో దోమలకు ఆవాసంగా మారింది. దీంతో దోమలు రాత్రి పగలూ తేడా లేకుండా దాడి చేస్తున్నాయి. వైద్యసిబ్బంది సైతం దోమల దాడితో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దానికి తోడు విషసర్పాల బెడద వెంటాడుతోంది. అయితే అధికారులు కానీ.. పాలకులు కానీ పీహెచ్‌సీ ఆవరణ శుభ్రత కోసం చర్యలు తీసుకోకపోవడం బాధాకరం. ఈ పరిస్థితుల్లో సిబ్బంది విధులు నిర్వహించడం కష్టంగా మారింది.

సిబ్బంది భద్రత ప్రశ్నార్థకం..

అయితే రాత్రివేళలో పీహెచ్‌సీ సిబ్బందికి భద్రత ప్రశ్నార్థకంగా మారింది. విధులు నిర్వహించే వైద్య సిబ్బందికి, ప్రసవానికి వచ్చిన వారికి భద్రత అంశం కలవరపెడుతోంది. పగటి వేళ అయితే రోగులు, వారితో పాటు వచ్చిన వారు సంచరిస్తుంటారు గనుక ఎటువంటి ఇబ్బంది లేదు. రాత్రివేళ విధులు నిర్వహించాలంటే సిబ్బంది బిక్కుబిక్కుమంటూ వెళ్లదీస్తున్నారు. అయితే ఇదే సమస్య పరిష్కారం కోసం మండలానికి చెందిన ఓ కూటమినేత దృష్టికి తీసుకెళ్లగా తాను చూసుకుంటానని వాగ్దానం చేశారు. తదనంతరం కాలంలో ఆయన కార్యాచరణలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు.

వర్షాలకు ఆస్పత్రి బురదమయం

మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆస్పత్రి ఆవరణ మొత్తం బురదమయం కావడంతో వైద్యసిబ్బంది కొందరు జారి కిందపడడంతో స్వల్ప గాయాలయ్యాయి. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పీహెచ్‌సీ ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారం నుంచి దుర్వాసన వెదజల్లుతుండడంతో అటు సిబ్బందితో పాటు స్థానికులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై పీహెచ్‌సీ వైద్యాధికారులను వివరణ కోరగా సమస్యను కూటమి నేతల దృష్టికి తీసుకెళ్లిన మాట వాస్తవమే అని చెప్పారు. ఓ కీలక నేత తన సొంత నిధులు వెచ్చించి జేసీబీ యంత్రంతో పిచ్చిమొక్కలను, చెత్తాచెదారాన్ని తొలగించే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆవరణలో సీసీ రోడ్డు నిర్మించేలా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పినా ఇంతవరకు సమస్య పరిష్కారం కాకపోవడంతోనే ఇలానే ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను జిల్లా వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లగా ఆమె నిధులు లేవని చెప్పడంతో ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు వైద్యసిబ్బంది. ఇకనైనా అధికారులు, పాలకులు సమస్యను పరిష్కరించి పీహెచ్‌సీలో సమస్యలను పరిష్కరించడంతో పాటు సిబ్బంది భద్రతకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది.